ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



ప్రపంచంలోనే స్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థగా ఆర్‌బీఐ

ప్రధాని మోదీ 2లో..

సంపుటి: 1 | సంచిక: 357 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 2 ఏప్రిల్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య

### అధిష్ఠానం కీలక ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం): వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిత్వంపై సస్పెన్స్ తొలగిపోయింది. ఇటీవల కాంగ్రెస్ లో చేరిన కడియం కావ్యను వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య ఆదివారం ( మార్చి 31న) కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ కేటాయించినా, ఆ పార్టీని వీడి హస్తం గూటికి చేరారు. అనుకున్నట్లుగానే కడియం కావ్య వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. ఏఐసీసీ పెద్దలు, కేసీ వేణుగోపాల్, తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలతో చర్చించిన అనంతరం అధిష్ఠానం సోమవారం రాత్రి ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. కాంగ్రెస్ అధిష్ఠానం ఇదివరకే అభ్యర్థుల 9 జాబితాలు విడుదల చేయగా, తాజాగా సోమవారం (ఏప్రిల్ 1న) రాత్రి ఇద్దరు అభ్యర్థులతో 10వ జాబితా ప్రకటించారు. మహారాష్ట్రలో అకోలా నుంచి డాక్టర్ అభయ్ ..మిగతా 2లో

# నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు

## ట్యాపింగ్ కేసులో ఎవర్నీ వదలం ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక

### పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉండదు




హైదరాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం): తెలంగాణలో హాట్ టాపిక్ గా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ చేసిన వాళ్లను వదిలేదే లేదని, ట్యాపింగ్ వెనుక ఎంత పెద్ద నాయకులు ఉన్నా శిక్ష పడుతుందని ఉత్తమ్ హెచ్చరించారు. తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని అన్నారు. కూతురు ఒక కేసులో ఇరుక్కుపోయింది. గొర్రెల స్కాంలో కొందరు ఇరుక్కుపోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరు ఇరుకుతారో అని బీఆర్ఎస్ వాళ్లకు భయం పట్టుకుందని ఉత్తమ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని, కేసీఆర్ కుటుంబం తప్ప మిగతా అందరూ కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న కాంగ్రెస్ పాలనను చూసి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి వస్తున్నారని తెలిపారు. లోక్ సభ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా రావని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 సీట్లు తప్పకుండా గెలుస్తామని ఉత్తమ్ జోస్యం చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ మిగలదని స్పష్టం చేశారు. తెలంగాణలో తాగు నీరు సమస్య, కరెంట్ సమస్య లేదని ఉత్తమ్ అన్నారు. కేసీఆర్ లాగా మాకు ఫామ్ హౌజ్ లో పడుకునే అలవాటు లేదని, ప్రతీరోజూ సచివాలయానికి వస్తున్నామని చెప్పారు. ప్రతి సమస్యపై వారం పదిరోజులకు ఒకసారి రివ్యూ చేస్తున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 40వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టారని విమర్శించారు. కేసీఆర్ అధికారంలో ..మిగతా 2లో



## తీహార్ జైలుకు కేజ్రీవాల్

ఏప్రిల్ 15 వరకూ కస్టడీ పొడిగింపు 2



## ఢిల్లీ కోర్టులో కవితకు దక్కని ఊరట 2




### కట్టుకథలతో ప్రజలను

## మభ్యపెట్టే యత్నం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం): మాజీ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణలో వాటర్ మేనేజ్‌మెంట్ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఎండిన పంటలను పరిశీలించిన తర్వాత సూర్యాపేటలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై భట్టి సోమవారం ఢిల్లీలో స్పందించారు. 'చలికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. మా పాలనలో ఇంకా వర్షాకాలం రానే రాలేదు. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ అని డబ్బా కొట్టారు అది కూడా కూలిపోయింది. నీళ్లు ఉంటే ఇప్పటికే అది మొత్తం కూలిపోయేది. కేసీఆర్ హయాంలో అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై ప్రస్తుతం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. కేసీఆర్ పదేళ్లలో ఎస్ఎల్‌బీసీ ఒక్క కిలోమీటర్ కూడా తవ్వలేదు. కాళేశ్వరం కార్పొరేషన్ బకాయిలు చెల్లిస్తాం. డిఫాల్ట్ కాబోము. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుగుతోంది. ఐఐటీలో చదివిన ఐఏఎస్‌లను డిస్కంలకు చీఫ్‌లను చేశాం. కేసీఆర్ మాత్రం ఒక అకౌంటెంట్‌ను సీఎండీ చేశారు' అని భట్టి విమర్శించారు.

### భక్తుల ఇంటికే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రుల

## కల్యాణ తలంబ్రాలు

### రూ.151 చెల్లిస్తే విశిష్టమైన రాములోరి తలంబ్రాలు పొందే సదావకాశం



హైదరాబాద్, మార్చి 29 (ప్రభాత ఉదయం): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరగబోయే శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని TSRTC యాజమాన్యం నిర్ణయించింది. గత ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇళ్ల వద్దకు చేరవేసే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టింది. ఎంతో విశిష్టత కలిగిన ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి.. వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలను భక్తులకు టీఎస్ఆర్టీసీ హెూం డెలివరీ చేస్తుంది. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆవిష్కరించారు. తలంబ్రాల బుకింగ్‌ను ఆయన ప్రారంభించారు. "నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా ఎన్నో ఏళ్లుగా రాములోరి కల్యాణంలో ఉపయోగిస్తున్నారు. విశిష్టమైన ఈ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చాలని రెండేళ్ల క్రితమే టీఎస్ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ ప్రయత్నానికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది. సంస్థపై ఉన్న విశ్వాసంతో భక్తులు భారీ సంఖ్యలో తలంబ్రాలను బుక్ చేసుకుంటున్నారు. 2022లో దాదాపు 89 వేల మంది భక్తులకు తలంబ్రాలను బుక్ చేసుకోగా.. గత ఏడాది 1.17 లక్షల మంది భక్తులకు తలంబ్రాలను సంస్థ అందజేసింది." అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు అన్నారు. భద్రాద్రిలో ఈ నెల 17న అంగరంగ వైభవంగా జరిగే శ్రీరామనవమి వేడుకలకు వెళ్లలేని భక్తులు ఈ సేవల్ని ..మిగతా 2లో

## కచ్చాతీవు రగడ




### భారత విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం): శ్రీలంక ఆధీనంలో ఉన్న కచ్చాతీవు ద్వీపం విషయంలో అధికార, విపక్షాల మధ్య విమర్శల యుద్ధం నడుస్తోంది. దేశ భద్రత ఏమాత్రం పట్టించుకోకుండా, స్పృహలేకుండా ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రభుత్వం శ్రీలంకకు కచ్చాతీవు ద్వీపాన్ని అప్పగించిందని ప్రధాని మోదీ ఆదివారం కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. దీంతో మరోసారి కచ్చాతీవు ద్వీపం వ్యవహారం తెరమీదికి వచ్చింది. తాజాగా కచ్చాతీవు ద్వీపం విషయంపై కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ స్పందించారు. భారత దేశ తొలి ప్రధానమంత్రి అయిన జవహార్‌లాల్ నెహ్రూ కావాలనే శ్రీలంకకు కచ్చాతీవు ద్వీపాన్ని అప్పగించారని విమర్శలు చేశారు.కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ మీడియాతో మాట్లాడారు. కచ్చాతీవు ద్వీపానికి సంబంధించి 1974లో పార్లమెంట్‌లో మాజీ కేంద్ర విదేశి వ్యవహారాల మంత్రి స్వరణ్ సింగ్ మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. 'స్వేచ్ఛ, సమానంగా ఇరుదేశాల (శ్రీలంక, భారత్) మధ్య ఒప్పందం కుదురుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నా. ఈ ఒప్పందాన్ని ముగింపు దశకు తీసుకువస్తాం. గతంలో ఇరుదేశాల మధ్య మత్స్యకారుల వేట, నేవిగేషన్ హక్కులను పొందినట్లుగానే భవిష్యత్తులో కూడా ఇరు దేశాలు ..మిగతా 2లో

# ఆటిజంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



అటిజం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు



ప్రపంచ ఆటిజం వారోత్సవాల పోస్టర్ ను అవిష్కరిస్తున్న డాక్టర్లు

## చిన్నారులకు 18 నెలలు రాగానే ఆటిజం పరీక్షలు నిర్వహించాలి


### అటిజం లక్షణాలున్న పిల్లలను అందరితో కలుపుకొని ముందుకు సాగాలి

బుద్వేల్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం): ఆటిజం ( మనోవైకల్యం)కు గురైన చిన్నారులను 18 నెలల వయసులో చిన్న పిల్లల వైద్య నిపుణులకు చూపించి ఆటిజం లక్షణాలు ఉంటే వారికి వివిధ రకాల తెరఫీల ద్వారా మనలో ఒకరిగా ఉండేటట్లు చేయవచ్చని వైద్య నిపుణులు సూచించారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా సోమవారం హిమాయత్ సాగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఐఐపీహెచ్) లో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మధుబాల రెంటల అధ్యక్షతన నిర్వహించిన ఆటిజం అవగాహన వారోత్సవాలలో యూనిసెఫ్ , పెర్నాండేజ్ ఫౌండేషన్ , ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాటిక్స్(ఐ ఏ పీ) లకు సంబంధించిన నిపుణులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా యూనిసెఫ్ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీసర్ డాక్టర్ జెలాలం బిరహాను తఫీజ్ మాట్లాడుతూ, ప్రతి బస్తీలో, గ్రామాలలో 18 నెలల లోపు చిన్నారుల మానసిక స్థితిగతులను ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్ల ద్వారా తెలుసుకొని వారిలో ఆటిజం సమస్యలు ఉన్నట్లయితే ఆ చిన్నారుల తల్లిదండ్రుల సూచనలు సూచనలు ఇచ్చి వారిని సాధారణ చిన్నారుల మాదిరిగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు . ప్రాథమిక దశలోనే ఆటిజం కు గురైన చిన్నారులను గుర్తించి వారిని ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐ పి హెచ్ హైదరాబాద్ పబ్లిక్ హెల్త్ ప్రాక్టీస్ అండ్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ డీన్ డాక్టర్ రాజన్ శుక్ల మాట్లాడుతూ, తెలంగాణలో రెండు జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ లో మూడు జిల్లాలలో ఆటిజం కు గురైన చిన్నారుల వివరాలు సేకరించి వారికి డాక్టర్ల సహకారంతో సాధారణ పిల్లలతో కలిసి జీవించేలా అనేక విధాలైన ప్రోత్సాహాలను అందజేస్తున్నామన్నారు. ఆటిజం బాలిన పడిన చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందుకోసం ఐఐపీహెచ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 222 మంది మాస్టర్ ట్రైనర్స్ ను, 4,227 మంది అంగన్వాడీ టీచర్లు, ఆషా వర్కర్లు, ఏఎన్ఎం లకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా ఆటిజం కు గురైన వారి వివరాలు సేకరించి వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫౌండేషన్ నియో నాటోలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ తేజో ప్రతాప్ మాట్లాడుతూ, ఆటిజం కు గురైన చిన్నారులకు వైద్య నిపుణుల సూచనలు సలహాలతో సాధారణ జీవితాన్ని జీవించేలా చూడాలన్నారు . తల్లిదండ్రుల నిర్లక్ష్యం కారణంగా ఆటిజం బారిన పడిన చిన్నారులను గుర్తించలేక పోతున్నామన్నారు. కోవిడ్ తర్వాత ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు . 100 మంది చిన్నారుల్లో ఒకరికి ఈ సమస్య వస్తున్నదన్నారు. ప్రభుత్వం ఆటిజం పై ప్రజలందరికీ అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు . బాలల హక్కులను కాపాడడానికి ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు . కార్యక్రమంలో పాల్గొన్న ఫెర్నాండెజ్ ఫౌండేషన్ డెవలప్మెంటల్ పీడియాట్రిషన్ డాక్టర్ దేదీప్య పుష్కర్ మాట్లాడుతూ, పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒకటిన్నర సంవత్సరాల తర్వాత చిన్నారులు చేయాల్సిన పనులలో తేడా కనిపిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు . మా పిల్లలకు వ్యాక్సినేషన్ వేయించాం అని ఊరుకోవడం మంచిది కాదన్నారు. అలవాట్లు ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే వెంటనే చిన్న పిల్లల వైద్య నిపుణులు సంప్రదించాలన్నారు. అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ట్వీన్ సిటీస్ బ్రాంచ్ కోశాధికారి, అంకుర హాస్పిటల్ పీడియాట్రిషన్ డాక్టర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ, వరల్డ్ ఆటిజం డే సందర్భంగా ప్రతి తల్లిదండ్రులను చైతన్యం చేయడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. కళ్ళలో కళ్ళు పెట్టి సూటిగా చూడకుండా ఉండడం, సమయానికి రావలసిన మాటలు, నడక రాకపోవడం, చేసిందే మళ్ళీ మళ్ళీ చేయడం ఉన్నట్లయితే డాక్టర్లను సంప్రదించాలన్నారు. ఆటిజం పుట్టుకతో వచ్చిన సమస్య అని, అయితే దానికి మందులు లేవని వారిని సాధారణ పిల్లలతో కలిసి బ్రతికేటట్లు వారిని వివిధ రకాల తెరఫీల ద్వారా చైతన్యం చేయాలన్నారు. కమ్యూనికేషన్, సోషల్ ఇంటరాక్షన్ లో ఆటిజం పిల్లలు సరిగా ఉండరన్నారు. అయితే వారిని తమలో ఒకరిగా చేర్చుకొని మెరుగుపరిచే విధంగా ఉండాలన్నారు . దూరం పెట్టకూడదన్నారు . ప్రతి డాక్టరు 18 నెలలుకు ఆసుపత్రికి వచ్చే చిన్నారులకు ఆటిజం పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ ట్విన్ సిటీస్ బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ సుగుణాకర్ రెడ్డి లు పాల్గొన్నారు . ఈ సమావేశంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ డెవలప్మెంటల్ అండ్ బిహేవియరల్ పీడియాట్రిక్స్ డాక్టర్ సమీర్ హసన్ దళ్వాయి ఆన్ లైన్ లో ఆటిజం లక్షణాలపై వివరించారు . అనంతరం ఆటిజం లక్షణాలపై పోస్టర్ ను విడుదల చేశారు.



ఎగిసి పడుతున్న మంటలు

# టాటా నగర్‌లో అగ్ని ప్రమాదం



బుద్వేల్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం): మైలార్ దేవ్ పల్లి టాటా నగర్ లో పరుపుల కంపెనీలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు . ఉదయం పదిగంటల మూడు నిమిషాలకు మంటలు చెలరేగడంతో ఆ కంపెనీ నిర్వాహకులు రఫీక్ రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే రాజేంద్రనగర్ ఫైర్ స్టేషన్ అసిస్టెంట్ డిస్టక్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ నేతృత్వంలో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారు. మంటలు ఎక్కువగా ఉండడం , పక్కనే మరో రెండు కంపెనీలు ఉండడంతో చాంద్రాయణగుట్ట ఫైర్ స్టేషన్ కు ఫోన్ చేసి మరో ఫైర్ ఇంజన్ ను రప్పించి మంటలను అర్పివేశారు. ఈ సంఘటనలో మంటలు అర్పుతున్న క్రమంలో ఒకరికి చేతికి గాయం అయినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మైలార్ దేవ్ పల్లి టాటా నగర్ లో కాటన్ బెడ్ పరుపులు కంపెనీ లో అగ్ని ప్రమాదం

## ఇంట్లో ఎవరు లేని సమయంలో
# ఓ మహిళ ఆత్మహత్య

బుద్వేల్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం) : ఇంట్లో ఎవరు లేని సమయంలో బాత్రూమ్ లో చున్నీతో ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. బీహార్ కు చెందిన ప్రవీణ్ కుమార్, రంగీలా కుమారి(20) భార్యభర్తలు. రెండు సంవత్సరాల క్రితం వీరికి వివాహం జరిగింది. బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి చింతల్ మెట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు . రంగీలా కుమారి కి రెండు నెలల క్రితం కొడుకు పుట్టి మరణించాడు . కొన్ని రోజులుగా రంగీలా కుమారి కి ఆరోగ్యం బాగుండడం లేదు. సోమవారం ఉదయం కూడ భర్తతో ఆరోగ్యం బాగాలేదని చెప్పింది. సాయంత్రం వచ్చి డాక్టర్ కు చూపిస్తానని చెప్పి ప్రవీణ్ కుమార్ పనికి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం నాలుగు గంటలకు భార్యకు ఫోన్ చేయగా ఆమె ఫోన్ తీయలేదు. పక్కింటి వారికి ఫోన్ చేసి చూడాలని కోరాడు. పక్కింటి వాళ్ళు వచ్చి చూడగా బాత్రూంలో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని పక్కింటి వారు ప్రవీణ్ కుమార్ కు చెప్పారు. ప్రవీణ్ కుమార్ ఇంటికి చేరుకొని అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.



రంగీల కుమారి



# కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డికి పారిశుద్ధ్య కార్మికుల మద్దతు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం) కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ కు చెందిన ఆటోల్లో చెత్త తరలించే పారిశుద్ధ్య కార్మికులు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి మద్దతును ప్రకటించారు. పారిశుధ్య కార్మికులు సోమవారం కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిని కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష ఆధారాభిమానాలు లభిస్తున్నాయని చెప్పారు. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సారధ్యంలో నియోజకవర్గంలో పార్టీ తిరుగులేని శక్తిల బలోపేతం అవుతుందని, వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా నాయకులు, కార్యకర్తలు చేరుతున్నట్లు చెప్పారు. అన్నివర్గాల ప్రజల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతరెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిపించి ఈ విజయాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి బహుమతిగా అందజేస్తామని సతీశ్ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మన మారాలు వైష్ణవి పెళ్లికి హాజరైన మాజీ మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి

## ఘనంగా ప్రకాష్ గౌడ్ మనవరాలు వైష్ణవి వివాహం

### నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రులు కేటీఆర్, సబితా రెడ్డి

శంషాబాద్, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మనవరాలు వైష్ణవి వివాహం నిఖిల్ గౌడ్ తో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. శంషాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ వివాహ వేడుకలకు రాష్ట్ర మాజీ మంత్రులు కేటి రామారావు. సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. పలువురు పార్లమెంటు సభ్యులు ఎమ్మెల్యేలు మాజీ మంత్రులు టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కార్తీక్ రెడ్డి గణేష్ గుప్తా. కొలను సుష్మ మహేందర్ రెడ్డి. నీరటి తన్వి రాజు ముదిరాజ్. దూడల వెంకటేష్ గౌడ్ . కొడిగంటి చంద్ర రెడ్డి. . మేకల వెంకటేష్ ముదిరాజ్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ఇఫ్తార్ విందు లో పాల్గొన్న శాసన మండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిమ్ సోదరులు

# శాస్త్రిపురంలో ఇఫ్తార్ విందు

బుద్వేల్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం) : శాస్త్రిపురం లో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్ తో పాటు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉండే ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం పుణ్యం అని గుర్తు చేశారు. రంజాన్ పండుగను, ఉపవాస దీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.



# మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం) మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం బిఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తో కలిసి నియోజకవర్గంలోని పరిధిలో బాలాజీ నగర్, కెపిహెచ్బి డివిజన్లోని వివిధ పార్క్ వాకర్స్ తో కలసి ఆత్మీయ సమ్మేళనం లో పలువురు స్థానిక నాయకులు పాల్గొని బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ రాగిడి లక్ష్మారెడ్డిని మల్కాజ్గిరి ఎంపీ గా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కూకట్ పల్లి నియోజకవర్గానికి అనేక నిధులు మంజూరు చేసి ఎంతో అభివృద్ధి చేశారని, చేసిన అభివృద్ధి కళ్ళ ముందు కనబడుతున్న అభివృద్ధికి ప్రజలు ప్రజలు రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పట్టం కట్టారని కోరారు. అందువల్ల చేసిన మేలుకు కృతజ్ఞతగా మనం తిరిగి అత్యధిక మెజారిటీ కూకట్ పల్లి నియోజకవ ర్గం నుంచి రాగిడి లక్ష్మారెడ్డి ని పార్లమెంటుకు పంపుదామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పగుడాల శిరీషా బాబురావు, మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ బాబురావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అసోసియేషన్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన జీఎం చంద్రశేఖర్ నుండి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన జిఎం ప్రభాకర్




పదవీ విరమణ చేసిన జిఎం చంద్రశేఖర్ ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘం నేత జావిద్

# పదవి విరమణ చేసిన జలమండలి జిఎం చంద్రశేఖర్

## ఇన్‌ఛార్జ్ జిఎంగా ప్రభాకర్.. చంద్రశేఖర్‌కు ఘనంగా వీడ్కోలు

రాజేంద్రనగర్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పదవీ విరమణ చేశారు. సోమవారం పదవి విరమణ చేసిన జీఎం చంద్రశేఖర్ ను అధికారులు సిబ్బంది శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. చంద్రశేఖర్ పదవీ విరమణ చేయటంతో కూకట్ పల్లి జలమండలి జనరల్ మేనేజర్ ప్రభాకర్ కు అదనపు బాధ్యతలు రాజేంద్రనగర్ జిఎంగా అప్పజెప్పారు. నూతనంగా జీఎం గా ప్రభాకర్ చంద్రశేఖర్ నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా పదవి విరమణ చేసిన చంద్రశేఖర్ మాట్లాడుతూ... ఉద్యోగులు పదవి విరమణ చేయటం సాధారణమేనని అయితే విధి నిర్వహణలో చేసిన పనులే ప్రజలకు సిబ్బందికి మేలు జరుగుతాయని అన్నారు. తనకు సహకరించిన అధికారులు సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్లు రాం నరసింహారెడ్డి, వినాయక్, శ్రావ్య రెడ్డి, ఉ ద్యోగ సంఘం నాయకులు జావిద్,తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన జలమండలి జీఎం చంద్ర శేఖర్ సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

# కాంగ్రెస్ తెచ్చిన కరువు

**కరెంటు అందాలంటే రైతులు సిబ్బందికి పైసలివ్వాలి**
**అమలు కాని ఆరు గ్యారెంటీలు**
**రుణమాఫీ పేరిట ఆగం చేసిండ్రు**


ఎండిపోయిన వరి పంట ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

కేటిదొడ్డి, ఏప్రిల్1 (ప్రభాత ఉదయం) రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతతోనే పంటలు ఎండిపోయాయని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం కేటిదొడ్డి మండలం ఉ మిత్యాల గ్రామ శివారులో గల వ్యవసాయ పొలంలో ఎండిన వరి పంటలను గద్వాల ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం రెండో పంటకు నీళ్లు ఇస్తామంటేనే నమ్మి పంటలు వేశామని.. మొదటే ఇవ్వబోమని చెప్పి ఉంటే వేసుకునే వాళ్లం కాదని వాపోయారు. విద్యుత్ శాఖ సిబ్బంది కరెంటు కోతలు విధిస్తున్నారని, కరెంటు కోత విధించకుండా సిబ్బందికి పైసల్ డిమాండ్ చేస్తున్నారని రైతులు తమ గోడును ఎమ్మెల్యే కు విన్నపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల్లోనే రైతులు దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఆవేధన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24గంటల విద్యుత్, సాగుకు నీరు, పెట్టుబడికి రైతు బంధు సాయం అందించి రైతాంగాని కంటిరెప్పలా కాపాడుకున్నామని కాని కాంగ్రెస్ 100రోజుల పాలనతో సాగుకు నీరందకా, కరెంటు కోతలు విధించడంతో పంటలు ఎండిపోయిన దుర్భర స్థితి నేడు రాష్ట్రంలో నెలకొందన్నారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తానన్నా ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని ధ్వజమెత్తారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ అంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అన్నదాతలను పూర్తిగా ఆగం చేసిందన్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ అసమర్థత, తెలివి తక్కువతనం, అవగాహన రాహిత్యమేనని ఆరోపించారు. తెలంగాణలో మళ్లీ జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు కొనుక్కునే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైతే ప్రభుత్వం అప్పులు చేయాలేకాని నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆనాడు రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని, నేడు తెలంగాణలో కరెంటు డిమాండ్ ఉందని తెలిసి కూడా ప్రభుత్వం అవసరమైనంత కరెంటు కొనకపోవడంతోనే వ్యవసాయానికి కరెంటు వస్తలేదన్నారు. ఎనిమిదేళ్లుగా కాలిపోని మోటార్లు ఇప్పుడు కాలిపోతున్నాయని చాలా మంది రైతులు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎండిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం ఇచ్చేవరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంటా ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.


పదవి విరమణ చేసిన జలమండలి ఉద్యోగులను సన్మానించిన ఎండి సుదర్శన్ రెడ్డి

## జలమండలిలో 16 మంది ఉద్యోగులు పదవీ విరమణ

హైదరాబాద్, ఏప్రిల్1(ప్రభాత ఉదయం): జీవితంలో పదవీ విరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం జలమండలి పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు జనరల్ మేనేజర్లు సహా.. 16 మంది ఉద్యోగులకు పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సమయంలో అందులోనూ జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి సొంత వారితో సమయం గడిచే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళ్లు.. రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, ఆపరేషన్స్ డైరెక్టర్స్ స్వామి, విజయరావు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వాటర్ ప్లాంట్ యజమానులు

**అక్రమ వాటర్ ప్లాంట్లను వెంటనే తొలగించాలి...పాపి రెడ్డి నగర్ బస్తీలోని వాటర్ ప్లాంట్లను తొలగించాలంటూ ఎమ్మెల్యే కు వినతి పత్రం అందించిన స్థానికులు...**



కూకట్పల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం) అసలే వేసవి కాలం, పైగా నీటి ఎద్దడి ఎదుర్కుంటున్న కూకట్ పల్లి మండల పరిధిలోని పాపిరెడ్డి నగర్ బస్తీలో అక్రమ వాటర్ ప్లాంట్ల నిర్వహణతో బస్తి వాసులు మరింత నీటి కష్టాలు ఎదురుకుంటున్నారు. అరా, కోర వస్తున్న నీరు వ్యాపార కేంద్రాలుగా మారిన వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు తోడేస్తూ నీటిని విక్రయిస్తూ సొమ్ముచేసుకోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయి నీటి కొరత ఏర్పాడి బస్తి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో ఉన్న బోర్లు సైతం ఎండిపోతున్నాయి. ఇంట్లో ఎవరైనా బోరు వేయాలంటే కినీసం 1000 నుండి 1500 ఫీట్ల వరకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే బస్తీలో ఉన్న వాటర్ ప్లాంట్ల కు తోడుగా రోడ్ నెం.16, బ్లాక్ ..సిలో మరో నూతన వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి ఎద్దడికి అడ్డుగా మారిన వాటర్ ప్లాంట్లను తక్షణమే తొలగించాలని బస్తి వాసులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై సోమవారం బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి సమక్షంలో పెద్ద ఎత్తున శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ని కలిసి వినతి పత్రం అందిస్తూ విన్నవించుకున్నారు. అదే విధంగా కూకట్ పల్లి మండల తహశీల్దార్ స్వామికి ఫోన్ లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బస్తి అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ , సిహెచ్ రామకృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి , శంకర్ రెడ్డి ,వీరన్న, కృష్ణారెడ్డి ,సత్యనారాయణతో పాటుగా బస్తి వాసులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.



## బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయి: కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

కూకట్పల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం) చలివేంద్రాలు బాటసారిల దాహార్తిని తీర్చేందుకు ఎంతో ఉపయోగపడతాయని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, తెలుగు రాష్ట్రాల ఓసి సంక్షేమ సంఘం అధ్యక్షులు జీ.కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అవుల రవీందర్ రెడ్డి ప్రజలకు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, మాజీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, సంఘం సభ్యులు ఆనంద్ రెడ్డి, మందడి సుధాకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, మాజీ కౌన్సలర్ దాసరి శంకర్ రెడ్డి, సభాపతి రెడ్డి, సురేందర్ రెడ్డి, కొత్త దామోదర్ రెడ్డి, సులోచన రెడ్డి,రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఉప్పల్లో జర్నలిస్టుల పై బీజేపీ దాడిని ఖండిస్తున్నాం:

**సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్.**



కూకట్పల్లి, ఏప్రిల్ 1 (ప్రభాత ఉదయం): ఉప్పల్ ప్రెస్ క్లబ్ లో మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి హుజురాబాద్ లో ఎస్సీ ల పై దాడి చేయించారని వాటి వివరాలను ప్రెస్ క్లబ్ లో వివరిస్తున్న సమయంలో బీజేపీ కార్యకర్తలు గుండాలగా ప్రవర్తించి వారి పై భౌతిక దాడులకు దిగడం, ఫర్నిచర్ ను ధ్వంసం చెయ్యడం అనాగరిక చర్య అని, అదే విదంగా వార్త కవర్ చేస్తున్న విలేకరి పైన దాడి చెయ్యడం దారుణమని సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి చేసిన వారి పై కేస్ నమోదు చేసి రిమాండ్ కు పంపించాలని డిమాండ్ చేశారు. సత్యం(నిజాలు) చెప్పే వారంటే బీజేపీ కి భయం అని వాటిని అరికట్టడం కోసం భౌతిక దాడులకు దిగడం వారికి ఏపాటి ఓర్పు,సహనం ఉందొ తెలుస్తోందని కావున మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే మాత్రం ప్రశ్నించిన వారు ఎవరైన సరే విలేఖరులు కూడా బాధితులే కాబట్టి దేశంలో విద్వేశం తగ్గి శాంతి సామరస్యం ఉండాలంటే బీజేపీ చేస్తున్న అన్యాయాలను మీడియా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వారిని ఓడగొట్టాలని కోరారు. జర్నలిస్టుల పై ఎటువంటి దాడి జరిగినా సీపీఐ ఖండిస్తుందని అన్నారు.పోలీస్ లు నిందితులను అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు.

## స్వర్ణాకర్షణ భైరవ మూర్తి విగ్రహం ఏర్పాటు కోసం లక్షయాభై వేల రూపాయల విరాళం



ధాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

కొత్తకోట,ఏప్రిల్ 1(ప్రభాత ఉదయం) వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి లో గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వరదత్త ఆలయంలోని ధ్యాన మందిరంలో స్వర్ణాకర్షణ భైరవ మూర్తి విగ్రహం ఏర్పాటు కోసం పదవి విరమణ పొందిన గద్వాల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిని రేవతి లక్షయాభై వేల రూపాయల విరాళం అందించారు. పదవి విరమణ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన రేవతి ని ఆలయకమిటి ప్రతినిధులు ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం లక్షయాభై వేల రూపాయల విరాళం ఆలయప్రధానకార్యదర్శి రుమాళ్ళశేఖర్ కు అందజేశారు.


శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సేవాలాల్ దీక్షకులు

## సేవాలాల్ దీక్షకులను ఆశీర్వదించిన సీనియర్ నాయకులు మూల మల్ల భీం రెడ్డి

కొత్తకోట,ఏప్రిల్1(ప్రభాత ఉదయం) గద్వాల్ జిల్లా దరూర్ మండల్ కొత్త పాలెం తాండా వాసులు 16 మంది సేవా లాల్ దీక్ష స్వీకరించారు. సోమవారం కొత్తకోట మండలంలోని పామాపురం గ్రామంలో గల శ్రీ భ్రమరాంబ సమేత రామేశ్వరాలయంలో పూజలు నిర్వహించి మాల ధరించారు. సేవాలాల్ దీక్షకులు 21 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఉంటారు. మహారాష్ట్ర లోని పౌర గడ్ సేవా లాల్ మహారాజ్ ఆలయం లో మాల తీయ డం జరుగు తుంది. ఈ పూజా కార్యక్రమంలో కొత్త కోట మండల సీనియర్ నాయకులు మూల మళ్ళ భీమ్ రెడ్డి వారితో కలసి పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో దీక్షలు కొనసాగించి తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగాలని కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో గ్రామం పంచాయతీ మాజీ సభ్యులు భరత్ యాదవ్ పాల్గొన్నారు.




## అశ్విన్ క్రికెట్ అకాడమీలలో ప్రత్యేక సమ్మర్ క్యాంపులు

**హెడ్ కోచ్ అశ్విన్ కుమార్ రాజు**

మేడిపల్లి ఏప్రిల్ 01(ప్రభాత ఉదయం) సమ్మర్ హాలీడేస్ లో క్రికెట్ కోచింగ్ లో మెరుగైన శిక్షణ ఇచ్చి విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సమ్మర్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని అశ్విన్ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ కమ్ హెడ్ కోచ్ అశ్విన్ కుమార్ రాజు అన్నారు . మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ తోపాటు రాంపల్లి లోని అశ్విన్ క్రికెట్ అకాడమీ లలో ఏప్రిల్ 5 నుండి ప్రారంభమయ్యే ఈ సమ్మర్ క్యాంపులలో నలభై అయిదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తామని హెడ్ కోచ్ అశ్విన్ కుమార్ రాజు తెలిపారు . రెగ్యులర్ క్లాసెస్ తో పాటు నిర్వహించే ఈ సమ్మర్ క్యాంప్ లో భాగంగా హెచ్ సీ ఏ నిర్వహించే వన్ డే , టూ డే , త్రీ డే మ్యాచ్ ల కోసం మెరుగైన శిక్షణ ఇవ్వడం జరుగుతుందనీ , ఉదయం ఆరు నుండి ఎనిమిదిన్నర వరకూ , సాయంత్రం నాలుగు నుండి ఏడు గంటల వరకూ సమ్మర్ క్యాంప్ జరుగుతుందని అన్నారు . ఈ సమ్మర్ క్యాంప్ ప్యాకేజీ లో భాగంగా విద్యార్థులకు ఎడ్యుకేషనల్ హస్టల్ , భోజనం సదుపాయం ఏర్పాటు చేస్తామని , విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు . మరిన్ని వివరాలకు 9603956526 , 9550927707 నంబర్లలో సంప్రదించవచ్చని అశ్విన్ అకాడమీ డైరెక్టర్ కమ్ హెడ్ కోచ్ అశ్విన్ కుమార్ రాజు తెలిపారు .

## కాంగ్రెస్ హయాంలో అష్ట కష్టాలు పడుతున్న రైతులు: చేవెళ్ల ప్రసాద్



శంషాబాద్,ఏప్రిల్ 1(ప్రభాత ఉదయం) రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ముఖ్యంగా రైతులకు అష్ట కష్టాలు మొదలయ్యాయని శంషాబాద్ మున్సిపల్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చేవెళ్ల ప్రసాద్ అన్నారు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని. మరోవైపు రైతుల సంక్షేమం కోసం సాగునీటి కోసం ప్రత్యేక కార్యక్రమాలను ఆయన రూపొందించాలని అన్నారు. పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఏనాడు కూడా రైతులకు సాగునీటి విషయం గానీ ప్రజలకు తాగునీటి విషయం గానీ ఇబ్బందులు ఏర్పడలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు సాగునీ రు లభించక పంటలు ఎండిపోతున్నాయని ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి ప్రజలు సమయార్థమవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలనతో విసిగిపోయిన ప్రజలు తిరిగి తెరాస ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు.

## ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిలిపివేత

**జాతీయ పార్టీల కుమ్మక్కు రాజకీయం**
**తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్**



హైదరాబాద్, ఏప్రిల్ 1(ప్రభాత ఉదయం) ఇటీవల జరిగిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఎన్. నవీన్ కుమార్ రెడ్డి విజయం ఖాయమని తెలియడంతో లోక్ సభ ఎన్నికల సాకుతో బిజెపి కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై ఓట్ల లెక్కింపుని ఎలక్షన్ కమిషన్ ద్వారా నిలిపివేయించారని తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజవరప్రసాద్ ఆరోపించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ లేకున్నా కాంగ్రెస్ పార్టీ ధనబలంతో ఎన్నికలను గెలవాలని అభ్యర్థిని నిలబడమే కాకుండా ఎన్నో కుట్రలకు పాల్పడిందని.. అయినా నవీన్ కుమార్ రెడ్డి విజయం ఖాయమని తెలిసిపోవడంతో కుట్రలకు తెరదీశారని, లెక్కింపును ఆపొచ్చు కానీ ఫలితాన్ని ఆపలేరని రాజావరప్రసాద్ అన్నారు. అన్నీ గమనిస్తున్న ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన తీర్పు ఇస్తారని ఈ సందర్భంగా తెలిపారు.

## కరోనా వల్ల రద్దు చేసిన 94 యు 92ఎం బస్ సర్వీసులను కొనసాగించండి

**ఆర్టీసీ అధికారులను కోరిన ఉప్పరపల్లి గ్రామ మహిళలు**


రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదిరాల సంధ్యా పరమేశ్

రాజేంద్రనగర్,(ప్రభాత ఉదయం):ఉప్పరపల్లి మీదుగా 94 యు,94 ఎం బస్సు సర్వీసులు నడిపి మహిళల బాధలను తీర్చాలని రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్ కు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి కి చెందిన ఆదిరాల సంధ్యా పరమేశ్ ఆధ్వర్యంలో మహిళలు వినతిపత్రం అందజేశారు.సోమవారం 94యు కోటి నుంచి ఉప్పర్ పల్లి, 92ఎం మేహిది పట్నం నుంచి ఉప్పర్ పల్లి మీదుగా రాజేంద్ర నగర్ కు బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. కరోనాకు ముందు ఈ బస్సులు నడిచేవని,కరోనా పుణ్యమా అని ఉన్న బస్సులు కాస్త రద్దు చేయడం వలన దూరప్రాంతాలకు ప్రయాణం సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక మహిళలు డిపో మేనేజర్ కు వివరించారు.అందుకు డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి తొలగించిన బస్సులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు పుష్ప, ప్రమీల,రమాదేవి,వసంత,మంగ,మనోహర,సుగుణమ్మ,లక్ష్మిబాయి,కల్పన,జ్యోతిస్,సుశీల,పద్మ, లలిత,అనసూయ,వాసవి తదితరులు పాల్గొన్నారు

## పాలకుల నిర్లక్ష్య వైఖరి!

**అమరచింతలో శాశ్వత ఆధార్ కేంద్రం అందుబాటులోకి వచ్చేనా!**



అమరచింతలో మూతబడిన శాశ్వత ఆధార్ కేంద్రం ఫోటో

అమరచింత,ఏప్రిల్1(ప్రభాత ఉదయం) అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏడాది దాటిన అందుబాటులోకి రాక పోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరి! పాలకులు పట్టించుకోకపోవడం వలన అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారేమో అని ప్రజలు అంటున్నారు శాశ్వత ఆధార్ కేంద్రం బంద్ కావడం వలన ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఆధార్ లో పేర్లు మార్పులు చేర్పుల విషయంలో ఇతర మండలంలో ఉన్న ఆత్మకూర్ చిన్నచింతకుంట లో ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు దీంతో డబ్బు తో పాటు సమయము వృధా అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు అధికారుల సైతం అమరచింత శాశ్వత ఆధార్ కేంద్రంను పునరుద్ధరించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు శాశ్వత ఆధార్ కేంద్రం విషయంలో తాసిల్దార్ కి పలుమార్లు వినతిపత్రం సమర్పించినప్పటికీ ఆధార్ సేవలు అందుబాటులోకి రాకపోవడం పాలకుల నిర్లక్ష్యా వైఖరికి సిగ్గుచేటు అంటున్నారు ప్రజలు. ఇప్పటికైనా అధికారులు పాలకులు చొరవ చూపించి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అమరచింతలో శాశ్వత ఆధార్ కేంద్రంలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.